క్లుప్తంగా

ఏబీవీపీ నూతన కార్యవర్గం



ఏబీవీపీ నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్: ఏపీవీపీ (అఖిల భారతీయ విద్యార్థి పరిషత్) సంఘం నగర నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణ, విభాగ్ కన్వీనర్ పూజారి రాఘవేంద్ర తెలిపారు. నగర కార్యదర్శిగా రుషేంద్రరెడ్డి, సహ కార్యదర్శులుగా వెంకీ, యోగేష్, పవన్, చరణ్, ఉపాధ్యక్షులుగా గజేంద్ర, వినీత్, చరణ్, ఆకాశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ గత 75 సంవత్సరాలుగా పనిచేస్తోందన్నారు. నిరంతరం విద్యార్థుల సమస్యల పట్ల పోరాటాలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పవన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞంలో ఎమ్మెల్యే



పూజలు చేసి మొక్కులు చెల్లిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

తవణంపల్లె: ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో ఆదివారం సాయంత్రం పూతలపట్టు ఎమ్మెల్యే ఎం ఎస్ బాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ కార్యనిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ధర్మరాజు, ద్రౌపదీ దేవి, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి, భాగవతార్‌కు కానుకలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వాహకులు ఎమ్మెల్యేకు అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, ఎంపీటీసీ బాబు, పార్టీ నాయకులు ఉమామహేశ్వర రెడ్డి, పరమేశ్వర రెడ్డి, దామోదరం, మురుగన్, శబరీష్, ఆలయ కార్యనిర్వాహకులు మోహన్‌వేలుశెట్టి, సదాశివ శెట్టి, మునస్వామి శెట్టి, గణేషన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరంతో అందరికీ ఆరోగ్యం



రోగులకు సేవలందిస్తున్న వైద్యసిబ్బంది

గుడిపాల: మండలంలోని చిత్తపార గ్రామంలో ఆదివారం కూడా వైద్య శిబిరాన్ని కొనసాగించారు. వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్ హరి తెలిపారు. కలుషిత ఆహారంతో వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారందరికీ వైద్య శిబిరం ద్వారా వైద్యసేవలు అందించారు. ఆదివారం 10 మందికి గ్లూకోజ్, మాత్రలను అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం అందరూ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. సోమవారం కూడా శిబిరాన్ని గ్రామంలోనే కొనసాగించనున్నట్లు వివరించారు. వైద్య సిబ్బంది వాణి, మోహన్‌శెట్టి, చంద్రశేఖర్, హేమలత, సంధ్య, సర్పంచ్ చంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

సరిహద్దుల్లో రాత్రివేళ నిఘా పెంచండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రవికుమార్


శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని శ్రీరంగరాజపురం మండలం తమిళనాడుకు సరిహద్దులో ఉన్నందున రాత్రివేళలో నిఘా పెంచాలని డీఎస్పీ రవికుమార్ అన్నారు. ఆయన ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతంలో అక్రమ రవాణా ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున, సిబ్బందితో నిఘా పెంచాలని సూచించారు. నెలవాయి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకు తరలించే ట్రాక్టర్లు, లారీలకు తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రివేళల్లో పకడ్బందీగా గస్తీ నిర్వహించి నేరాల నియంత్రణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఐ సత్యబాబు, ఎస్‌ఐలు షేక్షావలి, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శ్రీరామకోటి విజయోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో సోమవారం శ్రీరామకోటి విజయోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు సంవత్సర కాలంలో రాసిన శ్రీరామకోటి పుస్తకాలను శ్రీరామకోటి స్థూపంలో నిక్షిప్తం చేయడాన్ని విజయోత్సవంగా ప్రతి ఏటా విజయదశమి నాడు నిర్వహిస్తున్నారు.

కాణిపాకం: బాలాత్రిపుర సుందరిగా మరగదాంబికా దేవి, **యాదమరి:** దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి, **బంగారుపాళెం:** మహిషాసురమర్దినిగా వజ్రాలపురం గంగమ్మ, ముత్యాలమ్మ, **చిత్తూరు:** సాయిబాబా ఆలయంలో మహిషాసురమర్దిని అలంకారం











రాజరాజేశ్వరీదేవిగా దుర్గాంబ కటాక్షం!

చిత్తూరు రూరల్: రాజరాజేశ్వరీదేవిగా దుర్గాదేవి భక్తులను కటాక్షించారు. నగరంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గిరింపేటలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలో ఆదివారం దసరా బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేక పూజలు చేసి, సాయంత్రం అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దిని అలంకారం, ముత్యాలమ్మ ఆలయంలో మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. కోదండరామ స్వామి ఆలయంలో రామావతారం, సాయిబాబా ఆలయంలో మహిషాసురమర్దిని, రాజస్థాన్ సేవా సంఘ్ సభ్యులు మహాగౌరి అలంకారంలో అమ్మవారిని కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అమ్మవారి బహురూప దర్శనార్థం భక్తులు ఆయా మండపాల వద్ద అధిక సంఖ్యలో క్యూకట్టారు.

కందగిరి కొండపై..

గుడిపాల: మండలంలోని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవాలయంలో ఉన్న మూలస్థాన దుర్గమ్మ అమ్మవారు ఆదివారం రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం మహిళలందరూ కుంకుమార్చన చేసి పూజలు అందుకున్నారు. పల్లూరు గంగమ్మ అమ్మవారు దుర్గా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మహిషాసురమర్దినిగా గంగమ్మ

బంగారుపాళెం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ మహిషాసురమర్దినిగా భక్తులకు అభయమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక హోమం, పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వారిచే తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, మేనేజర్ మొగిలప్ప, ఆలయ అర్చకులు సుబ్రమణ్యం దీక్షితులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో ముత్యాలమ్మ..

మండల కేంద్రంలో వెలసిన గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయంలో మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులను కనువిందు చేశారు. ఉదయం ముత్యాలమ్మ మూలవిగ్రహానికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మ వారి మహిషాసుర మర్దినిగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కృష్ణమూర్తి, అర్చకుడు మురళీగురుకుల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓంశక్తి ఆలయంలో ..

మండల కేంద్రం బంగారుపాళెంలోని ఓంశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విగ్రహానికి విశేషపూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులచే ప్రసాదాలు పంపిణీ చేశారు.

మొగిలి వెంకటగిరిలో..

మండలంలోని మొగిలి వెంకటగిరి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిగ్రహాన్ని పుష్పాలతో విశేషంగా అలంకరించి పూజలు చేపట్టారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ప్రత్యేక దర్శన ఏరాట్లు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

బాలాత్రిపుర సుందరీగా మరగదాంబికా దేవి

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని శ్రీ మరగదాంబికా సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో వెలసిన అమ్మవారు బాలా త్రిపుర సుందరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవ నవరాత్రుల సందర్భంగా ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. యాదమరిలో వెలసిన కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని దుర్గాదేవి అలంకరణలో అలంలకరించి సింహవాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు.











చిత్తూరు: దుర్గాంబ దేవస్థానంలో దుర్గాదేవిగా.., **గుడిపాల:** దుర్గాదేవిగా పల్లూరు గంగమ్మ, కందగిరికొండ వద్ద రాజరాజేశ్వరీ దేవి అలంకరణ, **చిత్తూరు:** ముత్యాలమ్మ ఆలయంలో మహిషాసురమర్దిని అలంకరణ, రామాలయంలో రామావతారం

26 నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లె ఆదిఆంధ్రవాడలో ఈనెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 26వ తేదీ ఉదయం 10:30 గంటలకు మహాగణపతి హోమం, నవగ్రహ హోమం సాయంత్రం 5:30 గంటలకు అనుగ్య, వాస్తుహోమం, అమృత్ సంగ్రహం, ప్రవేశబలి, కళాకర్షణ, కలశ స్థాపనం, వేదపారాయణం, కలికోలం, గణపతి నవగ్రహ శివ, విష్ణు, ధన్వంతరి సుదర్శన ప్రథమకాల హోమం ఉంటుందని చెప్పారు. రాత్రి 7 గంటలకు కోలాటాలు, మరియు చెక్క భజనలు ఉంటాయని చెప్పారు. 27వ తేదీన 6 గంటలకు యాత్రాదాన సంకల్పం, రెండో కాల యాగశాల ప్రారంభం, 9 నుంచి 10:30 గంటల్లోగా మహా పూర్ణాహుతి, మహా గణపతి రుక్మిణీ సత్యభామ వేణుగోపాలస్వాముల వారికి మహా కుంభాభిషేకం ఉంటుందని తెలిపారు. రాత్రి స్వామివారి ఊరేగింపు బాణసంచా వేడుకల మధ్య జరుగుతుందన్నారు. 28వ తేదీ రాత్రి 9 గంటలకు శ్రీకృష్ణలీలలు(కంస వధ) నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు చెప్పారు.



ముస్తాబైన వేణుగోపాల స్వామి దేవాలయం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వవిద్యార్థులు

తవణంపల్లె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదవ తరగతి చదివిన విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఆదివారం అదే హైస్కూల్లో కలిశారు. నాటి విద్యార్థులు నేడు వివిధ హోదాల్లో పలుచోట్ల స్థిరపడ్డారు. ఆ విద్యార్థులంతా ఒక్క చోట చేరి తమ పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదపూజ చేసి ఆశీస్సులు అందుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహంగా గడపారు. తాము చదువుకొన్న పాఠశాలలో గుర్తింపుగా వినాయక స్వామి గుడిని నిర్మిస్తామని పూర్వవిద్యార్థులు ముందుకు వచ్చారు. గురువులను శాలువలతో ఘనంగా సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేసి సంతోషంగా గడిపారు.

సంతపల్లెలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

తవణంపల్లె: మండలంలోని సంతపల్లెలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. దాత, అర్ధగిరి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్ రెడ్డి ప్రజలకు పరిశుద్ధమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. తమ సొంత నిధులతో మండలంలోని సంతపల్లెలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రమైన స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. పుణ్యసముద్రంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్మించాలని ఎంపీటీసీ డేవిడ్, బుజ్జిరెడ్డి కోరారు. దీనిపై స్పందించిన సుగుణాకర్ రెడ్డి గది ఉంటే వెంటనే మిషన్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్ధగిరి ట్రస్టు బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్ర రెడ్డి, రెడ్డి ప్రసాద్ రెడ్డి, సదాశివరెడ్డి, మురళిరెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, భాను, రజనితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



సంతపల్లెలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సుగుణాకర్ రెడ్డి

చిత్తూరులో దశమి సందడి

చిత్తూరు రూరల్: నగరంలో ఆదివారం విజయదశమి సందడి నెలకొంది. సోమ, మంగళవారాల్లో విజయదశమి పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆయుధపూజకు కావాల్సిన సామగ్రి కొనుగోళ్లతో చర్చివీధి, బజారువీధుల్లో సందడి కనిపించింది.

అట్టహాసంగా దుర్యోధన వధ

తవణంపల్లె: మండల కేంద్రంలో వెలసియున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడి వద్ద మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. సాయంత్రం ద్రౌపదీదేవి, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు పూజలు చేయించారు. అనంతరం దుర్యోధనుడు మట్టి విగ్రహాన్ని అందంగా తీర్చిదిద్దారు. భీముడు, దుర్యోధనుడు వేషధారణ పోషించిన కళాకారులు కలింగ మడుగులో దాగి ఉన్న దుర్యోధనుడిని ఈడ్చుకొని వచ్చి వధించే ఘట్టం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి పలు గ్రామాల నుంచి ప్రజలు విశేషంగా తరలించారు. ఆలయ ధర్మకర్త మునస్వామి శెట్టి, కార్యనిర్వాహకులు మోహనవేలు శెట్టి, గణేష్, సదాశివశెట్టి, మాజీ ఎంపీటీసీ గణేషన్, స్థానికులు, ఉభయదారుల సహకారంతో మహాభారత యజ్ఞం దిగ్విజయంగా నిర్వహించారు. సోమవారం ధర్మరాజుల పట్టాభిషేకం, అగ్నిగుండ ప్రవేశంతో మహాభారత యజ్ఞం ముగుస్తుంది.



తవణంపల్లె: ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడి వద్ద దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకిస్తున్న జనం